కార్తీక మాసం... శుభకరం!

- 2వ తేదీ నుంచి కార్తీకమాసోత్సవాలు ప్రారంభం
- ముస్తాబవుతున్న బుగ్గరామేశ్వర క్షేత్రం


బుగ్గరామేశ్వస్వామి


ఆలయ ప్రాంగణంలోని పెద్ద పుష్కరిణి

ఓర్వకల్లు: శివునికి ప్రీతికరమైనది కార్తీక మాసం. శుభకరమైన కార్తీక మాసం ప్రతి ఏటా దీపావళి మరుసటి రోజు నుంచి ప్రారంభం అవుతుంది. హరిహరాదులకు ప్రీతిపాత్రమైన ఈ మాసంలో భక్తులు నియమ నిష్టలతో చేసే నోములకు ఎంతో ప్రాధాన్యం ఉంది. శివపార్వతుల అనుగ్రహం కోసం మహిళలు ప్రత్యేక పూజలు చేస్తుంటారు. భారతీయ సంస్కృతిలో కార్తీక మాసం అంటే నెల రోజులపాటు పండుగ దినాలే. ఈ మాసంలో దీపారాధనకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. దీపారాధనతో శుభఫలితాలతోపాటు ఆరోగ్య భాగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. ఈ మేరకు కార్తిక మాస పూజలకు బుగ్గరామేశ్వరస్వామి ఆలయం ముస్తాబవుతుంది. కర్నూలు పట్టణానికి సుమారు 30 కిమీల దూరాన కాల్వబుగ్గలో వెలసిన బుగ్గరామేశ్వరస్వామి ఆలయం ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రాలలో ఒకటిగా వెలుగొందుతుంది. పూర్వం ఐదువందల ఏళ్లకిందట మహా తపస్సంపన్నుడు జమదగ్ని మహా పతివ్రతా శిరోమణి, రేణుకాదేవి పుణ్య దంపతుల సప్తమ కుమారుడు, అవతార పురుషుడైన పరశురాముడు తన తండ్రి జమదగ్ని మహారాజును సంహరించిన క్షత్రియ రాజులను 21 పర్యాయములు దేశ నలుమూలల శోధించి, వారిని నిర్మూలన గావించించారు. దోషనివృత్తి చేసుకునేందుకు పరశురాముడు పుణ్యక్షేత్రములను సందర్శిస్తూ నిర్మించిన క్షేత్రాలలో కాల్వబుగ్గ క్షేత్రం ఒకటిగా ప్రసిద్ధినొందినట్లు నానుడి. విజయనగర సామ్రాజ్య కాలంలో ఈ ప్రాంతం ముద్దనూరు కోనసీమగా పిలువబడేదని శాసనాలు సమాచారం. ఈ ప్రాంతంలో వెలసిన నీటి బుగ్గ ద్వారా హుసేనాపురం, కాల్వ గ్రామాల భూములను సస్యశ్యామలం చేయుచున్నట్లు పూర్వీకుల మాట. ఈ క్షేత్రంలోని మూల స్వామికి బుగ్గరామేశ్వరస్వామిగా నామకరణం చేశారు. స్వాములవారి ఎదురుగా ఉన్న జంటనందులు, బసవన్నపాదాలు, దూరుడుగుండు, చిన్న నీటిబుగ్గ ఇక్కడి చారిత్రాత్మక విశేషంగా పూర్వీకుల కథనం. ఈ క్షేత్రాన్ని సందర్శించి, స్వాముల వారిని దర్శించుకుంటే సర్వ పాపాలు తొలిగిపోతాయని భక్తుల విశ్వసిస్తారు. ఈ మేరకు కార్తిక మాస పూజలకు ఆలయం ముస్తాబవుతుంది.

2వ తేదీ నుంచి కార్తీకమాస పూజలు

బుగ్గరామేశ్వర స్వామి సన్నిధిలో ఈ నెల 2వ తేదీ నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాలు జరుగుతాయి. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ప్రధాన అర్చకులు కొల్లె లక్ష్మీనారాయణ శర్మ, ఈఓ మద్దిలేటి తెలిపారు. ఇందులో భాగంగా 4వ తేదీన కార్తీక మాసం తొలి సోమవారం రోజు తెల్లవారుజామున స్వాములవారికి అభిషేకాలతో ప్రత్యేక పూజలు చేస్తారు. 11వ తేదీ రెండవ సోమవారం ఉదయం స్వాముల వారికి అత్యంత వైభవంగా కల్యాణోత్సవం నిర్వహిస్తారు. 18వ తేదీ మూడవ సోమవారం స్వాముల వారికి ప్రత్యేక పూజలతో పాటు, గ్రామోత్సవం ఉంటుంది. 25వ తేదీ నాల్గవ సోమవారం స్వాముల వారికి అభిషేకాధి పూజలు నిర్వహిస్తారు. అదేవిధంగా రాత్రి ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ మద్దిలేటి తెలిపారు. కార్తీక మాసంలో ప్రతి సోమవారం స్వాముల వారి దర్శనార్థం వచ్చే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.


ఆలయ ముఖద్వార గాలిగోపురం

భక్తులకు అన్ని వసుతులు కల్పిస్తాం

కార్తీక మాసం సందర్భంగా క్షేత్రానికి వచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. స్వాములవారి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బారీగేడ్లు ఏర్పాటు చేస్తున్నాం. వాహనాల పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. భక్తులకు అన్నదాన వసతి ఏర్పాటు చేస్తున్నాం. స్త్రీ,పురుషులకు వేర్వేరు స్నానపు ఘట్టాలలను ఏర్పాటు చేస్తున్నాం. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అనుగుణంగా అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నాం. భక్తులు కాల్వబుగ్గ క్షేత్రాన్ని దర్శించుకుని స్వామివారి దీవెనలు పొందాలి.

–బీటీ మద్దిలేటి, కార్యనిర్వహణాధికారి, కాల్వబుగ్గ దేవస్థానం


ఆలయ గాలిగోపురం


శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి మూలవిరాట్

- కార్తీకమాస పూజలకు సిద్ధమవుతున్న కొత్తూరు

పాణ్యం: ఉమ్మడి కర్నూలు జిల్లాలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన కొత్తూరు శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం కార్తీక మాసం పూజలకు ముస్తాబవుతుంది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు తాకిడిని దృష్టిలో ఉంచుకుని సులభతర దర్శనం కల్పించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ఈఓ రామకృష్ణ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నాలుగు వారాల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు కార్యచరణ రూపొందించారు. ఆది, సోమ, మంగళ వారాల్లో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. సుబ్రహ్మణ్య స్వామి ఆలయానికి ప్రత్యేక ఉంది. సుమారు నాలుగు వందల ఏళ్ల కిందట ఈ ప్రాంతలో నివశించే బీరం చెన్నారెడ్డి అనే రైతు భూమి దున్నుతుండగా నాగలికి ఏదో రాయి అడ్డుతగిలి పెద్ద శబ్దం వచ్చిందట. కాసేపటికే ఆ రైతుకు చూపుపోవడంతో చుట్టుపక్కల రైతులు వచ్చి నాగలిని వెనక్కి లాగారు. భూమి నుంచి పన్నెండు శిరస్సుల నాగేంద్రుడు విగ్రహం బయటపడిందట. అదే సమయంలో దారిన పోతున్న ఓ బ్రహ్మణుడు అది సుబ్రహ్మణ్యేశుడి విగ్రహమేనని నిర్ధారించినట్లు ప్రచారం ఉంది. బ్రాహ్మణుడి సూచన మేరకు స్వామివారికి అభిషేకం చేయగా రైతుకు కంటి చూపు వచ్చినట్లు పురాణాల సమాచారం. దీంతో గ్రామస్తులు ఆలయాన్ని నిరించేందుకు పూనుకుంటారు. అయితే స్వామివారు కలలో కనిపించి రాత్రి మొదలు పెట్టి తెల్లవారుజామున కోడి కూసే సమయానికి ఆలయం నిర్మాంచాలని ఆదేశించినట్లు నానుడి. దీంతో కేవలం గర్బగుడి చూట్టు గోడలను మాత్రమే నిర్మించారు గ్రామస్తులు. ఇప్పటికీ స్వామి వారికి గర్బలయానికి పైకప్పు ఉండదు. ప్రత్యేకించి కార్తీక మాసంలో ప్రతి మంగళవారం కాలసర్పదోష పూజలు భక్తిశ్రద్ధలతో జరుగుతాయి. భక్తులు బారులు తీరుతారు. అదేవిధంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని సంతానమూర్తిగా కొలిచే భక్తులు ఈ మాసం పూర్తయ్యేంత వరకు ఆలయానికి వచ్చి స్వామి వారికి సన్నిధిలో ఒడికడతారు. ఆలయ ప్రాంగలో కార్తీక దీపాలు వెలిగిస్తారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు



కార్తీక మాసం సందర్భంగా మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రల నుంచి భక్తులు ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకుంటుంటారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. పార్కింగ్, క్యూలైన్‌లు, విద్యుత్ సరఫరా ఇతర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాం. అలాగే భక్తులకు త్వరగా దర్శనం అయ్యేలా క్యూలైన్‌లో ఉన్న భక్తులకు స్వామి మూలవిరాట్ త్వరగా దర్శించుకునేలా చర్యలు తీసుకుంటున్నాం. కార్తీక మాసంలో సాధరణం కంటే మూడింతలు భక్తు లు వస్తారు. వారికి సరిపడేలా అన్న ప్రసాదాలను తయారి చేయిస్తున్నాం. భక్తులందరికీ స్వామి దర్శనం, అన్నప్రసాదాలు కల్పిస్తాం.

– ఈఓ రామక్రిష్ణ

క్లుప్తంగా

సాగులో మెలకువలు పాటించాలి


రైతులకు సూచనలు చేస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: సాగులో మెలకువలు పాటించాలని, అప్పుడే మంచి దిగుబడులు వస్తాయని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. మండల పరిధిలోని ఇనగండ్ల, గుండ్రేవుల గ్రామాలలో ఏఓ పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించిన ఏఓ సాగు సమాచారం, పంటల సంరక్షణపై రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లు ఈశ్వర్, సోమేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు గిరిజన విద్యార్థుల ఎంపిక


విద్యార్థినులతో ప్రిన్సిపాల్ మేరీ సలోమి

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలిక పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్ర గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ మేరీ సలోమి తెలిపారు. చెస్ పోటీలో ఆర్. పూజ, అండర్–17 కబడ్డీలో గంగోత్రి, అండర్–19లో హాకీలో గీత, అడంర్–17హాకీ విభాగంలో దుర్గా ప్రణీతాబాయి, అండర్–14లో అన్నపూర్ణ, వాలీబాల్ పోటీలో చంద్రకళ ప్రతిభ చాటారని వివరించారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి


మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్

కోడుమూరు రూరల్ : రబీ కింద సాగు చేసిన శనగ పంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి మంచి దిగుబడులను సాధించాలని ఏఓ రవిప్రకాష్ రైతులకు సూచించారు. మండలంలోని కోడుమూరు, వెంకటగిరి గ్రామాల్లో బుధవారం ఏఓ 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ కందిపంటకు గూడుపురుగు సోకుతున్నందున నువ్వాల్ నురాన్ మందును వేపనూనెతో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. శనగ పంటకు 20 రోజుల తర్వాత వేపనూనె, ఆస్ఫేట్ కలిపి పిచికారీ చేస్తే సరిపోతుందని ఏఓ తెలియజేశారు.

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి


అర్జీలు స్వీకరిస్తున్న నరేంద్రనాథ్‌రెడ్డి

పాణ్యం: రీ సర్వేలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని కొణిదేడు గ్రామంలో బుధవారం తహసీల్దార్ గ్రామసభ నిర్వహించారు. రైతుల నుంచి వినతులు స్వీకరించిన తహసీల్దార్ పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు.కార్యక్రమంలో డీటీ శివశంకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

శివారు ప్రాంతాల అభివృద్ధికి చర్యలు

కర్నూలు (టౌన్): నగర పాలక సంస్థ పరిధిలోని శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు చెప్పారు. ఆయన బుధవారం స్థానిక పందిపాడు, గుత్తి పెట్రోల్ బంకు సమీపంలోని బీఆర్ రెడ్డి నగర్, వీవీఎస్ ఫంక్షన్ హాలు రోడ్డు, సాయినాథ్ నగర్ కాలనీలలో కమిషనర్ పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజలు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అత్యవసర పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. పలు కాలనీల్లో తక్షణమే మురుగు కాల్వల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

సమస్యలు పరిష్కంచాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం బోధనేతర ఉద్యోగుల సమస్యలు పరిష్కంచాలని వర్సిటీ నాన్‌టీచింగ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడుకు వినతి పత్రం అందజేశారు. బుధవారం అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మీనాక్షిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్‌యాదవ్, సలహాదారుడు రంగనాథ్, సభ్యులు రిజిస్ట్రార్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు. వర్సిటీ ఏడీ బిల్డింగ్‌లో ఒకటే సెక్షన్‌లో ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలని, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులను కీలకమైన సెక్షన్ల నుంచి బదిలీ చేయాలని రిజిస్ట్రార్ దృష్టికి తెచ్చారు.

•సన్మానం


రిటైర్డ్ ఉపాధ్యాయుడు స్వామిరెడ్డి దంపతులను సన్మానించిన విద్యార్థులు

సి.బెళగల్: మండల పరిధిలోని ముడుమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు స్వామిరెడ్డిని బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ మేరకు ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు స్వామిరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. వారిని డీజే వాహనంపై గ్రామంలో ఊరేగించారు. విద్యార్థినులు కొలాటం, నృత్యాలతో గణితం మాష్టారు స్వామిరెడ్డికి వీడ్కోలు పలికారు.

ఎల్లమ్మ హుండీ కానుకల లెక్కింపు



కర్నూలు రూరల్ : మండల పరిధిలోని వెంకాయపల్లె ఎల్లమ్మ హుండీ లెక్కింపు బుధవారం ఈఓ దినేష్ ఆధ్వర్యంలో జరిగింది. గడిచిన మూడు నెలల సంబంధించి భక్తులు అమ్మవారికి సమర్పించిన నగదును లెక్కించగా రూ. 15,39,630 వచ్చినట్లు ఏఓ తెలిపారు. కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి సీతారామిరెడ్డి, ఏపీజీబీ బ్యాంక్ మేనేజర్ అన్వర్, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనువాసులు, పూజారులు చిన్నయ్య, యల్లరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సమీక్ష


మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

కల్లూరు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులపై ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి బుధవారం కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. లేబర్ బడ్జెట్, గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉపాధి పనుల కల్పన తదితర విషయాలపై ఆరా తీశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు టార్గెట్స్‌ను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ ఆదేశించారు. కార్యక్రమంలో ఏపిఓలు మద్దేశ్వరమ్మ, రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

2న ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక కంట్రోల్ రూమ్ సమీపంలోని స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ స్టేడియంలో నవంబర్ 2న స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్–19 విభాగంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్–19 జిల్లా కార్యదర్శి హర్షవర్ధన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే రోజు స్థానిక కిసాన్ ఘాట్ వద్ద ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో స్విమ్మింగ్, వాటర్ పోలో క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

సీసీఐ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి


ఖరీఫ్ పంట నమోదు పత్రాలను అందజేస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: పత్తి పంటల దిగుబడులు కొనుగోలు చేసేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బుధవారం పత్తి అమ్మకాలపై రైతులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఏఓ మాట్లాడారు. పెంచికలపాడు గ్రామంలోని మంజిత్ కాటన్ లిమిటెడ్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రంలో పత్తి విక్రయించుకోవాలని రైతులకు సూచించారు. ప్రభుత్వం క్వింటాం పత్తి రూ.7,521లు మద్దతు ధరగా నిర్ణయించిందన్నారు. అయితే ఖరీఫ్ సీజన్‌లో ఈ పంట నమోదు చేసుకున్న రైతులు మాత్రమే పత్తి విక్రయానికి అర్హులని చెప్పారు. అనంతరం ఖరీఫ్ సీజన్‌లో ఈ పంట నమోదు చేసుకున్న రైతులకు రశీదు పత్రాలను అందజేశారు.

మెరుగైన వైద్య సేవలందించాలి


వర్కూరులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న డీఎంఓ నూకరాజు

కోడుమూరు రూరల్ : ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా మలేరియా అధికారి నూకరాజు సిబ్బంది సూచించారు. మండలంలోని కోడుమూరు, వర్కూరు గ్రామాల్లో బుధవారం జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని డీఎంఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. డీఎంఓ మాట్లాడుతూ వైద్యు లు, గ్రామ పంచాయతీ సిబ్బంది ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. దోమ లు, నీటి మూలంగా వచ్చే డెంగీ, మలేరియా, మెద డువాపు, డయేరియా, అతిసారా తదితర వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలకు శుభ్రమైన మంచినీటిని సరఫరా చేయాలని డీఎంఓ సూచించారు. కార్యక్రమంలో ఈఓ అజయ్‌భాస్కర్, వైద్యాధికారి డాక్టర్ మదన్ శేఖర్, ఎంపీహెచ్ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, 104సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


శ్రీనివాసరెడ్డి (ఫైల్)

ఓర్వకల్లు: మండలంలోని హెచ్. కొట్టాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త శ్రీనివాసరెడ్డి బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. శ్రీనివాసరెడ్డి కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండేవాడని జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు తెలిపారు. వారం కిందట ఆరోగ్యం మరింత క్షీణించడంతో కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందినట్లు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పద్మనాభరెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మృతుని ఇంటివద్దకు వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సి.బెళగల్: మండలంలోని కంబదహాల్ గ్రామంలో పేకాట ఆడుతూ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ తిమ్మారెడ్డి బుధవారం తెలిపారు. కంబదహాల్ గ్రామ పొలిమేర శివారు పొనకలదిన్నె గ్రామదారి వంకపక్కనున్న ముళ్లపొదలలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడులు చేశామన్నారు. కంబదహాల్ గ్రామానికి చెందిన బోయ మల్లన్న, గోనెగండ్ల మండల పాత బోదెపాడు గ్రామానికి చెందిన గుర్రం సురేంద్రారెడ్డి, కోడుమూరు పట్టణం కొండపేటకు చెందిన బండారు శ్రీనివాసులును అదుపులోకి తీసుకున్నామన్నారు. కొందరు పరార్ అయ్యారన్నారు. నిందితుల నుంచి రూ.24,100, స్కూటర్ స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తొగర్చేడులో...

పాణ్యం: మండల పరిధిలోని తొగర్చేడు గ్రామ సమీపంలో పెకాట ఆడుతున్నారన్న సమాచరం మేరకు బుధవారం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి సబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. పేకాటాడుతున్న 12మందిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ చెప్పారు. వారి నుంచి రూ. 1, 20, 320 నగదుతోపాటు 11సెల్‌ఫోన్‌లు, 6మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్ఐ వెంట ఏఎస్ఐలు నరసింహులు, రఫిక్, రామాంజినేయులు, మధు, వెంకటేష్, గిరి, రవి ఉన్నారు.

మిస్టరీ కేసులపై దృష్టి సారించాలి


కేసుపై విచారణ చేస్తున్న అడిషినల్ ఎస్పీ యుగంధర్‌బాబు

పాణ్యం: మిస్టరీ కేసులపై దృష్టి సారించాలని నంద్యాల జిల్లా అడిషినల్ ఎస్పీ యుగంధర్‌బాబు పోలీసులకు సూచించారు. పాణ్యం పోలీసు స్టేషన్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో శాంతిభద్రల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇటీవల పాణ్యం పోలీసు స్టేషన్‌లో నమోదైన రెండు ఎస్పీ, ఎస్టీ కేసులుకు సంబదించి ఆయన స్వయంగా విచారణ చేపట్టారు. సంఘటన జరిగిన ప్రదేశాలను పరిశీలించి ఫిర్యాదారులను విచారించారు. అడిషనల్ ఎస్పీ వెంట సీఐ కిరణ్‌కుమార్‌డ్డి, ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా మేరీమాత మహోత్సవం


మేరీమాత స్వరూపానిన ఊరేగిస్తున్న భక్తులు


ప్రార్థనలు చేస్తున్న గురువులు

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు గ్రామంలో బుధవారం స్థానిక ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ ఆనందరాజు ఆధ్వర్యంలో సకల జనుల మాత(మేరిమాత) మహోత్సవం ఘనంగా జరిగింది. ముగింపు కార్యక్రమానికి కర్నూలు మేత్రాసనం పీఠాధిపతులు గోరంట్ల జ్వానేస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాయంత్రం స్థానిక బాలయేసు మందిరం(పాత చర్చి) నుంచి దేవమాత స్వరూపంతో పురవీధుల గుండా సకల జనుల మాతా దేవాలయం వరకు భక్తిశ్రద్ధలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ర్యాలీలో క్రైస్తవ గీతాలాపన చూపరులను ఆకట్టుకుంది. అనంతరం ప్రార్థనా మందిరంలో అమ్మవారి పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గోరంట్ల జ్వానేస్ వాఖ్యోపదేశం క్రైస్తవ ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఉపాధి పనులు కల్పించాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఓర్వకల్లు: ఉపాధి కూలీలకు తప్పనిసరిగా పనులను కల్పించాలని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో 5 ఎకరాలలోపు పొలం ఉన్న రైతులు పారం పాండ్స్ తవ్వుకునేలా చైతన్య పరచాలని తెలిపారు. అదేవిధంగా గ్రామాల్లో ప్రతి ఇంటికి ఇంకుడు గుంతను తవ్వుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుత ఏడాదికి మండలంలో మొత్తం 1000 ఇంకుడు గుంతలు తవ్వించేలా లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏపీఓ కుమార్‌సాయినాథ్, ఈసీ పెంచలయ్య, రాజునాయక్, టీఏలు, ఎఫ్ఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కర్నూలు రూరల్ : విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిఉదయ్, మండల కన్వీనర్ అంజి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక కర్నూలు మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శివకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం విద్యారంగ సమస్యలను నిర్లక్ష్యం చేస్తుందన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని ఇచ్చిన హామీని విస్మరించారన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, సూరి, ఆర్యన్, మధు తదితరులు పాల్గొన్నారు.

ఫసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోండి


రైతులకు సూచనలిస్తున్న ఏఓ సుధాకర్

ఓర్వకల్లు: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సుధాకర్ సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఉయ్యాలవాడ, ఉప్పలపాడు గ్రామాలలో పంట పొలాలను ఏఓ పరిశీలించారు. సాగు నూతన పద్ధతులను ఏఓ రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ భాస్కర్, రైతు సేవా కేంద్రాల సిబ్బంది రవికుమార్, వెంకటేష్, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.